


# సంతాపం

## పైడిశ్రీ

గుర్...(హీం...తుస్...

గుర్ర్.. .ళళాతుస్...బుస్...

సెంట్రల్ మినిస్టర్ కనకరాజు గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు. అది ఏర్ కండీషన్డ్. పైపెచ్చు సౌండ్‌ప్రూఫ్ గది కాబట్టి దేశం బతికిపోయింది. లేకుంటే ఢిల్లీలో పెట్టే గురక మారుమూల పల్లెదాకా వినిపించి దేశానికి దేశమే రాత్రిళ్ళు జాగారం చెయ్యాల్సిన గతి పడ్డేది.

"కనకరాజూ "

"ఒరేయ్ కనకరాజూ "

చటుక్కున కళ్ళు తెరిచేడు కనకరాజు తనని ఒరే అని పిలిచే దమ్ము ఈ దేశంలో ఎవడికుందా అనుకుంటూ. కళ్ళు తెరిచిన కనకరాజు తన కళ్ళను తానే నమ్మలేకపోయాడు. తను చూస్తున్నది కలో నిజమో తేల్చుకోలేని సందిగ్ధంలో పడ్డాడు.

"ఎవురు మీరు?"

తనకి తెలుసు వాళ్ళెవరో. అయినా సందేహ నివృత్తి కోసం అన్నట్టు అడిగేడు.

వాళ్ళు నవ్వేరు.

గదంతా మార్మోగింది.

"మీరెవురూ అంటంటే?" మళ్ళీ అరిచేడు కనకరాజు.

"కనపట్టంలా. యమభటులం." బృందగీతం పాడేరు ఆ ముగ్గురూ.

"సాల్లే పరాసికాలు?"

"ఏందా వికారం? మేం యమభటులం కాదనా నీ ఉద్దేశం?" కోప్పడ్డారు వాళ్ళు.

కనకరాజుకి దడ పట్టుకుంది.

నెత్తిన కొమ్ములు... జడలు దిగిన జుట్టు.. పెంటకుప్పల్ని లాగే దంతెల్లాంటి దంతాలు... నల్లగా పెయింటేసినట్టు మెరుస్తున్న శరీరాలు... మెళ్ళో పుర్రెల దండలు... నడుముకు ఎముకల పోగులు... చేతిలో తెల్లటి అంచుతో నిగనిగలాడే కత్తులు.

మొదట వాళ్ళను చూసి దసరా వేషాలవాళ్ళనుకున్నాడు. ఎంత దసరా వేషాలవాళ్ళయినా ఇంత రాత్రిపూట తన పడగ్గదిలోకి జొరబడి తనని ఒరే అని పిలవగలరా? ఊహూఁ... వీళ్ళు నిజంగానే యమభటుల్లాగున్నారు.

కనకరాజుకు నిద్ర మత్తెప్పుడో దిగిపోయింది. నోరు ఎండిపోయి నాలిక జిగట సాగడం ఇప్పుడే మొదలయ్యింది.

"ఏమిటి యిట్టాగొచ్చేరు? పొరపాట్న దారిగాని తప్పేరా?"

"లేదు. నీ కోసమే వొచ్చేం. పద ఎల్దాం!" అన్నాడొక యమభటుడు.

"యాడికి?"

"యమలోకానికి?"

"అప్పుడేనా? మొన్ననే గదా నేను సెంట్రల్ మినిస్టర్నయ్యిందీ? కొన్నాళ్ళు పదవిలో

కొనసాగనియ్యండీ.''

"ఇప్పటికే నువ్వు దేశాన్ని సగానికి సగం నాశనం చేసినావని మా పెబువులోరికి సిర్రెత్తుకొచ్చింది. ఎంటనే అణ్ణి జుట్టట్టుకు ఈడసకరండని మమ్మల్నంపేడు.'' యమభటు డొకడు ఓ అడుగు ముందుకేసేడు.

తన దుర్మార్గాలకు యమధర్మరాజులాంటివాడే కిందుమీదయ్యేడని తెలీగానే కనకరాజు ఒకింత సంతోషపడ్డాడు. చచ్చినాక ఏకంగా యమలోకం పోయి యముడి పదవికే ఎసరు పెట్టొచ్చు అనుకున్నాడు. అయినా సెంట్రల్ మినిస్టరు పదవి మీద ఇంకా మమకారం తీరలేదు.

"నా బోటోళ్ళు యిప్పుడప్పుడే సావరంట గదయ్యా? మీరేందీ అప్పుడే వొచ్చిపడ్డారు?'' అన్నాడు కనకరాజు వంకీకి తగిలించిన తన టోపీకేసే చూస్తూ.

"రూల్సు మారిపోయినాయి. ఇదువరికి ఎవుడెన్ని పాపాలు ఎక్కువజేస్తే అన్ని రోజులు ఎగస్ట్రాగా బతికేవోడు. ఇప్పుడట్టా కాదు. పాపాలకి ఒక లిమిటేసను పెట్టేం. అద్దాటితే మడిసికిక సావు తప్పదు.''

"మర్నేను లిమిటేసను దాటేసినానా?''

"ఇప్పుడేం కర్మ? నువ్వు పంచాయితీ ఎలచ్చన్లో నిలబడినప్పుడే నీ పాపాల లిమిటేసను దాటేసినావు. పంచాయితీ పెసిరెంటు వయినాక జిల్లా పరిసీత్ సేర్మనయినాక, ఎమ్మెల్యేవయినాక, మంత్రి వయినాక, ఎంపీవయినాక, ఇప్పుడు చెంట్రల్ మంత్రివయినాక యీ పాటికి ఏ వంద లిమిటేసన్లో దాటేసి ఉంటావు'' అన్నాడు యమభటుడు కత్తిని ఎడం చేతిలోంచి కుడిచేతిలోకి మార్చుకుంటూ.

"మరి పదేళ్ళ కిందటే రావలసినోళ్ళు యిప్పుడొచ్చేరేందీ?'' లా పాయింటు తీసేడు కనకరాజు వక్షస్థలంలో పట్టిన చెమటలు తువ్వాలుతో తుడుచుకుంటూ.

"అదా? మా లోకంలో ఓ పనికి మాల్నోడున్నాడు. వాడు ఇంద్రుడి ఏజెంటంట. ఫయిళ్ళు ఆడికాడ వుంటాయి. ఆడికీ, మా పెబువులోరికి మాటా మాటా 'వచ్చి సివర్న పెద్ద తగాదయింది. అది ఆకరికి ఇష్టుమూరితోరి కాడికి పోయింది. ఆయన ఓ కమీసనేపించి అసలు సంగతి తెలుసుకోని మా పనికిమాల్నోణ్ణి తీసేపిచ్చి ఆడి సీట్లో ఓ కొత్తోణ్ణి పెట్టేరు. కొత్తోడు సామాన్నమైనోడు గాదు. జపాను అగ్గిపుల్లలాంటోడు. ఆడొచ్చి ఫయిళ్ళన్నీ తిరగదోడేడు. దాంట్లో నీ పేరు, మరికాసిని పేర్లు బైటబడ్డాయి.''

"నిలబడే వున్నారు. కూకోండి.'' మర్యాద చేయబోయేడు కనకరాజు.

యమభటులు మొహామొహాలు చూసుకున్నారు. వాళ్ళలో ఒకడన్నాడు: "ఆ మాటా యీ మాటా చెప్పి మా నెత్తికి ఆవఁదం రాద్దామనుకుంటన్నావేమో. నీ అనుమంటోళ్ళని లచ్చల మందిని సూసేం. నర్సుడూ'' అంటూ కత్తి మొన వీపు కానించి కనకరాజును ఒక్క తోపు తోసేడు.

ముందుకు తూలిపడ్డ కనకరాజుకు కుర్చీ అంచు తగిలి మూతి చిట్లి రక్తం కారసాగింది. మూతిని చేత్తో తడిమి చూసుకుని, "మీకన్నా మా పోలీసోళ్ళే నయం. మడిసిని సచ్చేదాక కొట్టినా నెత్తుటి చెమ్మ కాన్రానీరు!'' అన్నాడు పైకిలేస్తూ.

ఆ మాట విని అదిరిపడ్డ యమభటుడు - "ఆర్నీయమ్మ, మరిసేపోయేను. మన లిస్టులో ఎవుడో పోలీసోడి పేరుంది సూడండి'' అన్నాడు.

"అవునవును.'' వంత పలికేరు మిగతా ఇద్దరూ.

"మీరు యీడి సంగతి సూస్కోండి. నేను ఆడి సంగతి సూస్కొనొస్తాను.''

కనకరాజు గతుక్కుమన్నాడు. ఇహ తనకి చావు తప్పదని తేలిపోయింది. కాళ్ళ బేరానికొచ్చేడు.

"అయ్యయ్యా! సిన్నోళ్ళయినా మీ కాళ్ళకి మొక్కుతాను. ఒక్క అయిదు నిమిసాలు టయిమియ్యండి. రొండంటే రొండు 'పోంకాల్సు' సేసొస్తాను'' అంటూ ఒక ఉదుటున బెడ్డు పక్కన అమర్చిన ప్రయివేట్ ఫోన్ మీదకి ఉరికేడు. తన సొంత ఊళ్ళో ఉన్న తన అనుచరుడొకడికి ఫోన్

"తెల్లగా ఉండే మీ తమ్ముడు ఈ మధ్య నల్ల బడ్డాడు? ఎలా?'' అడిగాడు రవి.

"పూర్వం పిండి మరలో పని చేసేవాడు? ఇప్పుడు 'బొగ్గు గని'లో పని చేస్తున్నాడు అంతే? చెప్పాడు సురేష్.

---

భార్య: ఏమిటండీ కడుపు నొప్పి మాత్రలు తెచ్చారు. ఎవరికి?

భర్త: నీకే. నిన్న మన పక్కింటి వాళ్ళు కొత్త స్కూటర్ కొన్నారులే. ఎందుకైనా మంచిదని...

గార్లపాటి [హైదరాబాద్]



చేసేడు. రెండుసార్లు ట్రై చేశాగ్గాని మనిషి లైన్లోకి రాలేదు.

"ఒరే నరిసిమ్మా..." గాభరాగా పిల్చేడు.

"అయ్యా? తమరా?యాణ్ణుంచీ?" నరిసిమ్మ దాదాపు అరిచినంత పనిచేసేడు అవతల్నుంచి.

"ఢిల్లీనుంచి..."

"ఇంత రేత్రేలప్పుడు... ఏందీ?"

"గుడిసెలు తగులబెట్టించే పనేవయింది?"

"అయిపోయింది."

"మొత్తం ఎన్ని గుడిసెలు తగులబెట్టేరు?"

"పదిహేడు."

"ఎంతమంది సచ్చేరు?"

"ఆరుగురు ముసిలోళ్ళు, ఇద్దరాడోళ్ళు, నలుగురు పిల్లకాయలు?"

"మన ఎంకటేసులు గోణ్ణి కతం జెయ్యండి ముందు."

"ఎందుకూ?"

"అదే రాసకీయం. మన రగస్సేలన్నీ ఆడికి తెలిసిపోయినాయిగా? రేపానా కొడుకు ఎగస్పార్టీలో చేరి మనల్ని బేక్మెయిల్ సేస్తాడు. ఈ మద్దినేందో మరి... మన పాతరంకులన్నీ బైటపడిపోతన్నాయి. పేపరోళ్ళు ఏకి పారేస్తన్నారు."

"అట్టాగట్టాగే."

ఫోన్ డిస్కనెక్ట్ చేసేడు కనకరాజు. అప్పటికే అతని ఒళ్ళంతా చెమట పట్టింది. మరో నెంబరు డయల్ చేసేడు. వెంటనే రెస్పాన్సొచ్చింది.

"అలో...!" అరిచేడు కనకరాజు.

"నవఁస్కారమయ్యా."

"ఇదో ఓబులూ... అయ్యగారున్నారా?"

"ఉన్నారు గానీ... ఆయన గదిలోకి యిప్పుడే పంకజమ్మగా రెళ్ళేరు. ఇప్పుడప్పుడే బైటికి రాకపోవచ్చు."

"అయితే ఓ పన్చేయ్. ఆయన కోమాట సెప్పు. ఏమనంటే కనకరాజు గోరికి తవరు సెప్పిన పన్లన్నీ సేసేసినారంట. మన్నూర్నించి రేపు నరిసిగోడు పొంజేస్తాడంట అన్చెప్పు."

"అట్టాగేనయ్యా."

ఫోన్ డిస్కనెక్ట్ చేసి ఒక్కసారి గుండెమీద చెయ్యేసుకుని ఓ పొడవాటి నిట్టూర్పు విడిచేడు కనకరాజు. ఆ నిట్టూర్పుతో పాటు అతని ప్రాణం కూడా బయటికొచ్చేసింది. యములోళ్ళతో కలిసి అతని ఆత్మ బైటికి నడిచింది.

*** *** ***

మర్నాటి ఉదయం...

ఎనిమిన్నర గంటలప్పుడు దేశంలోని ప్రజలు ఎంతో ఆశతో వివిధ బారతి ట్యూన్ చేసి రేడియోల దగ్గర కూర్చున్నారు. రేడియోలోంచి "ప్యాంవ్... పియ్యాంమ్... అంటూ విషాద సంగీతం వినిపించింది. అప్పుడప్పుడు విరామ సమయాల్లో వివిధ భారతి అనౌన్సర్లు ఇలాంటి వల్లకాటి సంగీతం వినిపిస్తూంటారు. ఇదీ అదేనేమో ననుకున్నారు. ఒక నిముషం... రెండు... మూడు... పది నిముషాలైంది సంగీతం మొదలై. శ్రోతలకు అనుమానమేసింది. ఆ అనుమానం మొలకెత్తిందే తడవు మ్రానైకూర్చుంది.

"కారెక్కరమన్లో యిప్పుడు పిళ్ళంగుడి చెరువాయూర్ గారి గానం వింటారు" అని వినిపించేసరికి శ్రోతలు హతాశులయ్యేరు.

"కొంపదీసి ఎవరన్నా రాజకీయ నాయకులు గానీ బాల్చీ తన్నేశారా ఏం?" మొదట ఆంధ్ర దేశంలో ఓ శ్రోత మరొక శ్రోతనడిగేడు యీ ప్రశ్న.

తర్వాత్తర్వాత అదే ప్రశ్న దేశంలోని కోట్లాది మంది రేడియో శ్రోతలకు ఎదురయింది.

ఆనాటి దిన పత్రికల్లో కొందరికి తమ ప్రశ్నకు సమాధానం దొరికితే, మధ్యాహ్నం పూట ప్రసారమయ్యే జాతీయ వార్తల్లో దేశం మొత్తానికి సమాధానం దొరికింది. ఇంకేముంది? నగటు భారతీయ రేడియో శ్రోత గుండె పగిలింది.

అలాగే నగటు భారతీయ టెలివిజన్ ప్రేక్షకుడి కడుపు బావురుమంది.

"ఎన్ని రోజులట సంతాప దినాలు?"

"ఏడు రోజులు."

గోవిందా... గోవిందా!"

అను నిత్యం ఆయా సమయాల్లో రేడియో వినడానికి, టీవీ చూడ్డానికి అలవాటుపడ్డారు జనం. చెత్తో, సుత్తో ఏదో ఒకటి వినకపోతే, చూడకపోతే ఒకపట్టాన తోచి చావదు. అందుకే రేడియో సెట్లు, టీవీ సెట్లు ఆన్‌చేసి ఉంచేరు. శోకం... శోకం... ఒకటే శోకం! దేశంలో ఏ ఇంట చూసినా శోకం... కోపం... బాధ... కసి... అయినా పళ్ళ బిగువున భరించేరు. కొందరు భక్తి సంగీతం కోసం ఆశపడి రేడియో, టీవీలు కట్టెయ్యకుండా అలానే పెట్టి ఉంచేరు. కొందరు కోపం పట్టలేక రేడియోలు కట్టేసేరు. టీవీల్ని మూసేసేరు. కానీ రేడియోనో, టీవీనో చూడకుండా ఇంట్లో ఎంతసేపని అలా ఉండడం? అందుకే మళ్ళీ రేడియోలు, టీవీలు ఆన్ చెయ్యక తప్పలేదు.

అలా ఆన్ చేసేరో లేదో...

శోకం... శోకం... ఒకటే శోకం!

ఒక్క రోజు కాదు, రెండ్రోజులు కాదు...

వారం రోజులు... ఏడు రోజులు.

ప్రజలు శోకంతో క్రుంగి కృశించి చిక్కి శల్యమైపోయేరు.

మొత్తానికి దేశం దేశమంతా స్మశాన వైరాగ్యంలో కొట్టుమిట్టాడింది- ఆ వారం రోజులూను.

*** *** ***

కనకరాజు ఆత్మ యమలోకం చేరుకునేసరికి ఏడు రోజులు పట్టింది. ఫారిన్ కార్లలో తిరగడానికి అలవాటు పడి ఒక్కసారిగా ఏడు రోజుల పాటు కాలి నడకన ప్రయాణం చేసేసరికి కనకరాజు ఆత్మకు శోషొచ్చి పడిపోయింది. చాలాసేపటి వరకూ లేవలేదు. కళ్ళు తెరిచి చూసేసరికి తన కళ్ళను తానే నమ్మలేకపోయింది కనకరాజు ఆత్మ.

తను మెత్తని హంసతూలికా తల్పంమీద ఉంది. చుట్టూ దేవకన్యలు, స్వర్గలోకవాసులు సపర్యలు చేస్తున్నారు.

ఒక్కసారిగా గట్టిగా తల విదిలించింది కనకరాజు ఆత్మ.

సందేహం లేదు.

ఇది స్వర్గమే!

వీళ్ళందరూ దేవతలు!

తను స్వర్గానికెలా వచ్చాడు?

భూలోకంలో తను హత్యలు, నేరాలు, గృహ దహనాలు, మానభంగాలు- మరెన్నో నీచాతి నీచమైన ఘోరాలకు ఒడికట్టేడు. తన అంచనాల ప్రకారం తను ఖచ్చితంగా నరకానికి వెళ్ళాల్సి ఉంది. అక్కడ కనీసం కొన్ని వందల సంవత్సరాలు అగ్ని గుండాల్లో పడి నరకవేదన అనుభవించాల్సి ఉంది. కానీ ఇదేమిటి?

ఇంతలో స్వర్గాధిపతి ఇంద్రుడు అటుగా వచ్చేడు. నేరుగా ఆయన దగ్గరకే వెళ్ళి అడిగింది కనకరాజు ఆత్మ. "ఇంద్రా! నరకానికి వెళ్ళాల్సిన వాణ్ణి. స్వర్గాని కొచ్చా నేనిటి?"

ఇంద్రుడు చిరునవ్వు నవ్వేడు.

"మీరలా మాయనవ్వులు నవ్వి నన్ను కన్ఫ్యూజ్ చేయకండి" ప్రాధేయపడింది కనకరాజు ఆత్మ.

"ఇందులో కన్ఫ్యూజ్ కావాల్సిన పనేముంది? నువ్వు భూలోకంలో బతికి ఉన్నప్పుడు బడా రాజకీయ నాయకుడివి గదా! నువ్వు చనిపోగానే నీ ఆత్మశాంతి కోసమని, నీకు సంతాపం తెలియజేయడం కోసమని ప్రభుత్వం వారు ఏడు రోజులు సంతాప దినాలుగా ప్రకటించారు. ఈ ఏడు రోజుల పాటు నీ కారణంగా, నీ పేరుమీద రేడియోలలోను, టీవీలోనూ శోక సంగీతం విని వినీ మీ దేశ ప్రజలు భయంకరమైన శిక్ష అనుభవించేరు. నువ్వు చేసిన పాపాలకూ... నీ కారణంగా ఎనభై కోట్ల మంది రేయనక పగలనకా ఏడు రోజుల పాటు అనుభవించిన శిక్షకూ చెల్లిపోయింది. అంటే నువ్వు అనుభవించాల్సిన శిక్షను నీ దేశ ప్రజలు అనుభవించేరు. కాబట్టి నీవు ప్రస్తుతం పవిత్రుడివి. కనుకనే స్వర్గలోక ప్రాప్తి కలిగింది. అదీ సంగతి." అనేసి ఇంద్రుడు చక్కా వెళ్ళిపోయాడు.

కనకరాజు ఆత్మ అది విని ఆఖర్న సానుభూతిగా "చ్చొచ్చొచ్చో" అంది. అంతటితో ఆగక "నా దేశ ప్రజలందరికీ నా ప్రగాఢ సంతాపం" అంటూ బాధగా అరిచింది.

మర్నాడు ఆ విషయం స్వర్గంలోని వార్తా పత్రికలు పతాక శీర్షికలతో అచ్చేసేయి. స్వరగ లోకపు రేడియో, దూరదర్శన్‌లు కోళ్ళై కూశాయి అదే విషయాన్ని. ★

